ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 28 అక్టోబరు 2024 | www.prajaaswaramdaily.com | 4 pm

# 1న మూసీ పునరుజ్జీవానికి శంకుస్థాపన



నిర్ణయం తీసుకునే ముందు
వెయ్యి సార్లు ఆలోచిస్తా
బాపూఘాట్ నుంచి పనులు
ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధం
సీఎం రేవంత్

హైదరాబాద్, ప్రజాస్వరం: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యి సార్లు ఆలోచిస్తామని.. తీసుకున్నాక వెనక్కి వెళ్లేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబరు 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబర్ లోపు ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు.మూసీ ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి అభ్యంతరమైతే మంత్రులు, అధికారులను కలిసి అభ్యంతరాలు చెప్పొచ్చు. అని అన్నారు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజాప్రతినిధులను పంపుతా అన్నారు.

# రుణమాఫీపై కారుకూతలు సహించం

## ఇది రైతు ప్రభుత్వం

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
రైతులకు ఇబ్బంది కలుగకుండా విప్లవాత్మక మార్పులు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం, ప్రజాస్వరం: రైతులు తీసుకొచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేబ్రిడ్జి కాటాలో తేడా వస్తే మిల్లు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడారు.



### దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

అర్హత ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను దీపావళి కానుకగా ఇవ్వబోతున్నాం. నాడు రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు ఎలా ఇళ్లు కట్టించారో ఇప్పుడూ అలాగే ఇస్తాం. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పాం.. ఇవ్వబోతున్నాం. ధాన్యంలో తేమ శాతం కోసం ఎండబెట్టుకుని తీసుకెళ్లాలి. సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు పత్తిని తీసుకురావాలి. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలి. రైతులు ఫిర్యాదు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటాం. అన్నదాతలకు ఎక్కడా నష్టం కలగకుండా చూడాలి. వారి అవసరాలు, కష్టాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది'' అని పొంగులేటి అన్నారు.

"ఈ సంవత్సరం అధిక వర్షాలతో రైతులు పత్తి పంట నష్టపోయారు. తొమ్మిది సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం. వారికి ఎక్కడా ఇబ్బంది కలగకూడదని విప్లవాత్మక మార్పులు చేశాం. ఇప్పటికే రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం. రుణమాఫీపై ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. అర్హులైన రైతులందరికీ తలతాకట్టు పెట్టయినా రుణమాఫీ చేస్తాం. డిసెంబర్‌లోపే రూ.13 వేల కోట్ల రుణమాఫీ అమలు చేస్తాం.

## సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతి అరెస్ట్

14 రోజులు రిమాండ్
నకిలీ పత్రాలతో భూరిజిస్ట్రేషన్ కు సహకరించినకు గాను..

హైదరాబాద్ : సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పత్రాలతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం సహకరించిన ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. మేడ్చల్ కోర్టు సబ్ రిజిస్ట్రార్ జ్యోతికి 14 రోజులు పాటు రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళ్తే..సుభాష్ నగర్‌లో 200 గజాల స్థలాన్ని నకిలీ పత్రాలతో పద్మాజా రెడ్డి అనే మహిళ కబ్జా చేసింది. కాగా, అప్పట్లో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జ్యోతి ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం పద్మజా రెడ్డికి సహకరించింది. పోలీసులు ఇటీవల పద్మజా రెడ్డిని అరెస్ట్ చేయగా తాజాగా ఈ కేసులో సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతిని సైతం అరెస్ట్ చేశారు.

## ఆంధ్ర.. మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు

వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ

అమరావతి,ప్రజాస్వరం: మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిల్లీలోని ఏఐఐఏ నుంచి వర్చువల్‌గా ఆయన ఈ సేవలను ఆవిష్కరించారు. అనంతరం ఎయిమ్స్‌లో అధికారులు ప్రయోగాత్మకంగా డ్రోన్ పరీక్ష చేపట్టారు. ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్‌సీ వరకూ డ్రోన్‌ను పంపించారు. ఓ మహిళా రోగి నుంచి రక్త నమూనా సేకరించి ఎయిమ్స్‌కు అది తిరిగొచ్చింది. ఎయిమ్స్ నుంచి ఈ పీహెచ్‌సీ దాదాపు 12 కి.మీ దూరంలో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ఉపయోగంపై ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## మంచిర్యాల జిల్లాలో పెద్దపులి సంచారం

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

మంచిర్యాల, ప్రజాస్వరం : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ధర్మారం, టీకనపల్లి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది. మంగళవారం బుగ్గగట్టు ప్రాంతంలో గొర్రెల మందపై దాడి చేసి మూడు గొర్రెలను హతమార్చింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పాదముద్రల ఆధారంగా పెద్దపులిగా గుర్తించారు. అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

## 3 రోజుల క్రితం కుమారుడు మృతి

గుర్తించలేక మృతదేహంతోనే అంధ తల్లిదండ్రులు
నాగోలులో ఘటన

నాగోలు, ప్రజాస్వరం : ఇంట్లో కుమారుడు మూడు రోజుల క్రితం మృతి చెందినా ఆ అంధ తల్లిదండ్రులు తెలుసుకోలేక పోయారు. కొడుకు వచ్చి తమకు భోజనం పెడతాడని ఆకలితో అలమటిస్తూనే ఎదురు చూడసాగారు. కానీ తమ పక్కనే కొడుకు మృత దేహం ఉందనే విషయాన్ని ఆ అంధ వృద్ధ దంపతులు తెలుసుకోలేకపోయారు. ఇంట్లో దుర్వాసన వస్తుంటే ఎలుకో, పిల్లో చనిపోయి ఉంటుందని అనుకున్నారేగానీ.. తమ కన్నబిడ్డే మృతి చెందాడని తెలుసుకోలేకపోయారు. ఆకలితో అలమటిస్తూ ఆ వృద్ధ జంట మూడు రోజులుగా ఇంటి బటయకు రాకపోవడం.. పైగా ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగు పోలీసులకు సమాచారం అందించారం అందిచడంతో ఈ విషయం వెలుగు చూసింది.

ఈ హృదయ విదరాక ఘటన హైదరాబాద్ నాగోలు ఠాణా పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... తెలంగాణలోని నాగోలు జైపూర్‌కాలనీ సమీప అంధుల కాలనీలోని ఓ అద్దె ఇంట్లో గత నలభై ఏళ్లుగా కలువ రమణ (59), శాంతికుమారి (64) దంపతులు నివసిస్తున్నారు. వీరిద్దరికీ కంటి చూపు లేదు. రమణ ట్రైబల్ వెల్ఫేర్‌లో ఉద్యోగి. అక్కడి ప్రభుత్వ వసతిగృహంలో కిందిస్థాయి ఉద్యోగి. రమణకు కంటి చూపు లేక పోవడంతో వేరే వ్యక్తిని తన ఉద్యోగంలో సహాయకుడిగా పెట్టుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రదీప్.. తన భార్యతో కలిసి వేరు కాపురం ఉంటున్నాడు. చిన్న కుమారుడు ప్రమోద్ (32) తన భార్యతో కలిసి తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ప్రమోద్ పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఇటీవల ప్రమోద్ మద్యానికి బానిస కావడంతో నాలుగు రోజుల క్రితం అతడి భార్య, ఇద్దరు కుమార్తెలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది.



నాటి నుంచి ప్రమోద్ పనిమానేసి, తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మద్యం తాగి వచ్చిన ప్రమోద్‌కుమార్‌కు ఫిట్స్ రావడంతో ఇంట్లోనే మృతి చెందాడు. కంటి చూపులేని రమణ, శాంతకుమారి కుమారుడు తమ కళ్ల ఎదుటే చనిపోయి పడి ఉన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. కుమారుడు వస్తాడు.. తమకు భోజనం పెడతాడని ఎదురు చూడసాగారు. బయటకు వచ్చేందుకు శక్తి లేక.. అదే ఇంట్లో మృతదేహంతో మూడు రోజుల కుపైగా ఉన్నారు.

## హెజ్‌బొల్లా చీఫ్‌గా నయీం ఖాసిమ్



ప్రపంచం : లెబనాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న హెజ్‌బొల్లా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల హత్యకు గురైన సంస్థ చీఫ్ హసన్ నస్రల్లా వారసుడిగా డిప్యూటీ జనరల్ నయీం ఖాసిమ్‌ను (Naim Qassem) ఎన్నుకుంది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబర్ 27న బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హసన్ నస్రల్లా మరణించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో నస్రల్లా మరణంతో హెజ్‌బొల్లాకు భారీ దెబ్బే తగిలింది. నస్రల్లా హత్య తర్వాత అతని బంధువు హాషీమ్ సఫీద్దీన్‌ను వారసుడిగా భావించారు. అయితే, తమ దాడుల్లో సఫీద్దీన్ కూడా మరణించినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ఐడీఎఫ్ ప్రకటించింది. ఆ తర్వాత హెజ్‌బొల్లా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. ఈ నేపథ్యంలోనే నయీం ఖాసిమ్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

## భవనంపై ఇజ్రాయెల్ దాడి

55 మంది పాలస్తీనియన్లు మృతి
అట్టుడుకుతున్న పశ్చిమాసియా

గాజా : ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం ఇజ్రాయెల్ దళాలు గాజాపై మరోసారి విరుచుకుపడ్డాయి. ఉత్తర గాజాలోని బీట్ లాహియాలో ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ దాడి చేయడంతో 55మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్లు పాలస్తీనా సివిల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ వెల్లడించింది. శిథిలాల కింద చిక్కుకొని చాలా మంది గాయపడ్డారని పేర్కొంది. చనిపోయిన వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులేనని పాలస్తీనా న్యూస్ ఏజెన్సీ తెలిపింది. కాగా ఈ దాడిపై ఇంతవరకు ఇజ్రాయెల్ స్పందించలేదు. ఇజ్రాయెల్ దాడులతో సుమారు లక్షమంది పాలస్తీనియన్లు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు లేక అలమటిస్తున్నారని పాలస్తీనియన్ సివిల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ పేర్కొంది. గాజాలోని ఆసుపత్రుల్లో వైద్య సామగ్రి, మానవ వనరుల కొరత అధికంగా ఉందని అక్కడి అరోగ్య శాఖ వెల్లడించింది. ఈ దాడులపై కౌన్సిల్ ఆన్ అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ (సీఏఐఆర్) స్పందించింది. గాజాపై దాడులను విరమించి, సాధారణ పౌరుల ప్రాణాలు కాపాడాలని అమెరికాను కోరింది.

### అరచేతిలో ప్రాణాలు

ఎటువైపు నుంచి ముప్పు ముంచుకొస్తుందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు గాజా పౌరులు. అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ చొరవతో ఇరువర్గాలు సంధి ఒప్పందానికి వస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో తమ నిఘా అధిపతి పాల్గొంటున్నారని ఇటీవల ఇజ్రాయెల్ పేర్కొంది. ఒప్పందం కుదిరితే పోరాటం ఆపేస్తామని హమాస్ వర్గాలు సైతం వెల్లడించాయి. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా.. దాడులు మాత్రం తగ్గకపోవడం ఆందోళనకరంగా మారింది.

## సీఎం రేవంత్‌తో హరికృష్ణ, శ్రీకాంత్ భేటీ



హైదరాబాద్, ప్రజాస్వరం : జాతీయ క్రీడలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ చేశారు. మరో రెండేళ్లలో జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. త్వరలో బెస్ట్ స్పోర్ట్స్ పాలసీని ప్రభుత్వం రెడీ చేయనుంది. లేటెస్ట్‌గా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్ పెండ్యాల హరికృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరికృష్ణ తాను గెలుచుకున్న మెడల్‌ను చూపించారు. పోటీల సందర్భంగా ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిని బ్యాడ్మింటన్ ప్లేయర్ పద్మశ్రీ కిదాంబి శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో కాసేపు ముచ్చటించారు. ఆటగాళ్లు- ముఖ్యమంత్రి మధ్య స్పోర్ట్స్ యూనివర్సిటీ గురించి చిన్నపాటి చర్చ జరిగినట్టు సమాచారం.